క్లుప్తంగా

ఘనంగా రామాలయ ప్రతిష్ఠోత్సవం



హోమ గుండం వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య, తదితరులు

గజపతినగరం రూరల్: మండలంలోని కాలం రాజుపేట గ్రామంలో రామాలయ ప్రతిష్ఠోత్సవాలను గ్రామస్తులు శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. ఆలయం వద్ద మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, జెడ్పీటీసీ గార తవుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, నాయకులు బెల్లాన త్రినాథరావు, గేదెల సురేష్ తదితరులు పూజల్లో పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



వేతనదారులతో మాట్లాడుతున్న ఏపీఓ నరేంద్రకుమార్

మెరకముడిదాం: మండలంలోని పతివాడిపేట గ్రామంలోని తోటవాని చెరువులో చేపడుతున్న ఉపాధి పనులను ఇన్‌చార్జి ఏపీఓ నరేంద్రకుమార్ శనివారం పరిశీలించారు. వేతనదారుల మస్టర్ల సీట్లను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన వేతనదారులతో మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్ ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేస్తేనే ప్రభుత్వం నిర్దేశించిన గరిష్ఠ వేతనం రూ.272 అందుతున్నారు. పని ప్రదేశంలో టెంట్లు తప్పనిసరిగా వేయాలని, మెడికల్ కిట్లు, తాగునీరు అందుబాటులో ఉంచాలని మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్‌కు సూచించారు.

గిరిజన విద్యార్థులకు సహాయం



విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేస్తున్న తపస్వి ట్రస్ట్ సభ్యులు

శృంగవరపుకోట: మండలంలోని రాజీపేట గ్రామంలో ఉన్న శంబలనగరి ఆశ్రమం నేతృత్వంలో నడుస్తున్న తపస్వి చారిటబుల్ ట్రస్టు సభ్యులు శనివారం గిరిజన విద్యార్థులకు తమవంతు సాయం అందించారు. తపస్వి ధ్యానం నాన్న జన్మదినం సందర్భంగా పలపుదుంగాడ ప్రాథమిక పాఠశాలలోని 63 మంది విద్యార్థులకు రైటింగ్ ప్యాడ్‌లు, స్కేళ్లు, జామెట్రీ బాక్స్‌లు, నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, కాపీ రైట్, డ్రాయింగ్ పుస్తకాలు, వాటర్ బాటిళ్లు అందజేశారు. ట్రస్టు సభ్యులు హనుమశ్రీ, శారద, సదాశివరావు, వర్మ, మురళీకృష్ణ, సోమేశ్వరరావు, హెచ్‌ఎం సత్యవతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వలంటీర్లకు సన్మానం



సన్మానం పొందిన వలంటీర్లతో నాయకులు, సచివాలయ ఉద్యోగులు

బొండపల్లి: ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా ఉంటూ గ్రామ వలంటీర్లు నిస్వార్థంగా అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని వైస్ ఎంపీపీ మీసాల సరోజిని, గొట్లాం పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్ మహంతి రమణ అన్నారు. వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా మండలంలోని గొట్లాం సచివాలయంలో వలంటీర్లను శనివారం సన్మానించారు. వైఎస్సార్ సీపీ జిల్లా నాయకుడు మీసాల తులసీరాం, పంచాయతీ కార్యదర్శి నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

నియామకపత్రాల అందజేత



వలంటీర్లకు నియామకపత్రాలు అందజేస్తున్న ఎంపీపీ హైమావతి, తదితరులు

గంట్యాడ: మండలంలోని రామవరం, వసంత గ్రామాల్లో ఖాళీగా ఉన్న రెండు వలంటీర్ పోస్టులను అధికారులు భర్తీ చేశారు. వలంటీర్లుగా నియమితులైన వారికి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పీరుబండి హైమావతి శనివారం నియామక పత్రాలు అందజేశారు. జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, రామవరం సర్పంచ్ పీరుబండి పద్మ పాల్గొన్నారు.

ఎండీఎం సరుకుల నాణ్యత పరిశీలన

గజపతినగరం: మండలంలోని పురిటిపెంట గ్రామంలో రేషన్ డిపోలో ఉన్న ఎండీఎం(మధ్యాహ్న భోజనం) సరుకుల నాణ్యతను ఉపాధ్యాయులతో పరిశీలన చేయిస్తున్నామని ఎంఈవో విమలమ్మ అన్నారు. ఇదే విషయమై ఆమె శనివారం విలేకరులతో మాట్లాడుతూ మండల కేంద్రంలోని ఎంఎల్‌ఎస్ పాయింట్ నుంచి పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి సరఫరా అయ్యే సరుకుల నాణ్యత, తయారీ, కాలం చెల్లిన తేదీలను సరిచూసి, నాణ్యమైన సరుకులు మాత్రమే పాఠశాలలకు చేరేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల అందజేత



దత్తిరాజేరు: చినకాద గ్రామానికి చెందిన సత్యనారాయణరాజుకు రూ. 3లక్షల చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

దత్తిరాజేరు: మండలంలోని చినకాద గ్రామానికి చెందిన దంతులూరి శివవెంకట సత్యనారాయణరాజు అనారోగ్యంతో బాధపడుతున్నారు. వైద్యం చేయించుకునేందుకు ఆర్థిక స్థోమత సరిపోకపోవడంతో ప్రభుత్వం నుంచి సహాయం అందేలా చూడాలని కుటుంబ సభ్యులు గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్యను కోరారు. ఆయన సీఎం రిలీఫ్ ఫండ్‌కు సిఫార్సు చేయగా రూ.3 లక్షలు మంజూర య్యాయి. సంబంధిత చెక్కును బాధితుడికి మరడాం సచివాలయంలో ఎమ్మెల్యే శనివారం అందజేశారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి

రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా నాయకులు,కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య మరడాం సచివాలయ పరిధి నాయకులకు సూచించారు. మరడాంలో శనివారం ఆయన ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, చేసిన మంచిని ప్రతీ ఇంటికి వెళ్లి వివరించాలని



జామి: అట్టాడ వ్యక్తికి రూ.2.90 లక్షల చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

సూచించారు.

పరామర్శ

తాడెందొరవలస గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మరపి శంకరరావు భార్య కొద్ది రోజుల క్రితం మృతి చెందారు. శంకరరావు కుటుంబాన్ని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య శనివారం పరామర్శించారు. ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు, జెడ్పీటీసీ రొంతు రాజేశ్వరి, వైస్ ఎంపీపీ బమ్మిడి అప్పలనాయుడు, మిత్తిరెడ్డి రమేష్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు, ఏఎంసీ వైస్ చైర్మన్ మండల శ్రీను, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాపాక కృష్ణమూర్తి, మండల జేసీఎస్ కన్వీనర్ ఫణీంద్రుడు,నాయకులు శంకరరావు, ఆదినారాయణ, గోవింద్, మురార్జీ, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అట్టాడ వ్యక్తికి రూ.2.90 లక్షలు

జామి: మండలంలోని అట్టాడ గ్రామానికి చెందిన మట్టా సత్యనారాయణ అనారోగ్య సమస్యతో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించు కున్నారు. పేద కుటుంబం కావడంతో వైద్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం నుంచి సహాయం అందించాలని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్యను కోరారు. ఎమ్మెల్యే సిఫార్సుతో రూ.2.90 లక్షలు మంజూరయ్యాయి. సంబంధిత చెక్కును బాధితుడికి ఎమ్మెల్యే అప్పలనరసయ్య విజయనగరంలోని తన క్యాంపు ఆఫీస్‌లో శనివారం అందజేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొర్లె రవికుమార్, డీసీసీబీ డైరెక్టర్ పాండ్రంకి సంజీవి, అట్టాడ సర్పంచ్ అమ్మన్నదొర, రాష్ట్ర గ్రీనింగ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ చలుమూరి సత్యారావు, నాయకులు పి.ఎర్నాయుడు,సంతోష్ పాల్గొన్నారు.

సీతారామపురం వ్యక్తికి రూ.2.50 లక్షలు

గజపతినగరం: మండలంలోని సీతారామపురం గ్రామానికి చెందిన మారోతు హేమంత్ కుమార్ ఇటీవల బ్రెయిన్ సర్జరీచేయించుకున్నారు. బాధితుడికి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.2.50లక్షల చెక్కును ఆయన కుటుంబ సభ్యులకు స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య శనివారం అందజేశారు. జెడ్పీటీసీ గార తవుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, నాయకులు బెల్లాన త్రినాథ రావు, బోని సంగమయ్య, ఎస్.గురునాయుడు, సీతారామపురం, మాజీ సర్పంచ్ టి.జనార్ధన రావు, దాసరి జగన్నాథం, ఎస్.గురు నాయుడు, సాంబమూర్తి పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయం



మహిళకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

• 'గ్రామ సందర్శన'లో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

కొత్తవలస: పేద, బడుగు,బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు అమలు చేశారని, సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమప్రాధాన్యం ఇచ్చారని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. 'గ్రామ సందర్శన' కార్యక్రమంలో భాగంగా మండలంలోని బలిఘట్టాం గ్రామంలో పార్టీ నాయకులతో కలిసి శనివారం పర్యటించారు. గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకోవడంతో పాటు పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ప్రభుత్వ భవనాల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలు పేదలకు, పెత్తందారులకు మధ్య జరగబోయే యుద్ధమన్నారు. పేదలు,రైతులు,మహిళల పక్షపాతి అయిన సీఎం జగన్‌ను ఆశీర్వదించాలని కోరారు. అర్హులందరికీ పార్టీలతో సంబంధం లేకుండా పథకాలు అందించామని చెప్పారు. పేదలు బాగుపడడం చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్ ఇష్టం లేదని, పేదలు అలాగే పేదరికంలో ఉండిపోవాలన్నదే వారి ఆకాంక్ష అని మండిపడ్డారు. పేదల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు సీఎం జగన్ నిరంతం కృషి చేస్తున్నారని చెప్పారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో టీడీపీ, జనసేన నాయకులు గ్రామాల్లోకి వచ్చి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేయడంతో పాటు బూటకపు హామీలు ఇస్తున్నారని, వారిని నమ్మవద్దని ప్రజలకు సూచించారు. ఎంపీపీ నీలంశెట్టి గోపమ్మ, పీఏసీఎస్ అధ్యక్షుడు గొరపల్లి శివ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, వైఎస్సార్ సీపీ నాయకులు ఆదిరెడ్డి నాయుడు,పెదిరెడ్ల సూరిబాబు, వెంకన్నపాత్రుడు, పి.ఎస్.ఎన్.పాత్రుడు, వై.మాదధవరావు, బి.సురేష్ పాల్గొన్నారు.

జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న సీఐ చంద్రశేఖర్, తదితరులు

కొత్తవలస: స్థానిక ఉన్నత పాఠశాల మైదానంలో శారద మెటల్స్, ఎల్లాయిస్ కర్మాగారం ఆధ్వర్యంలో సీఎస్ఆర్‌లో భాగంగా నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను సీఐ ఎస్.చంద్రశేఖర్, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ చైర్మన్ గొరపల్లి శివ శనివారం ప్రారంభించారు. మూడురోజుల పాటు సాగనున్న ఈ పోటీల్లో 16 జట్లు పాల్గొంటున్నాయి. సీఐ మాట్లాడుతూ యువత క్రీడా స్ఫూర్తి కలిగి ఉండాలని అన్నారు. శారద కర్మాగారం సీనియర్ జీఎం ప్రభాత్‌మోహన్ మాట్లాడుతూ ఇప్పటి వరకు ఈ తరహా పోటీలను కేవలం కొత్తవలస మండలానికే పరిమితం చేశామని ప్రస్తుతం జిల్లాస్థాయిలో నిర్వహిస్తున్నామని చెప్పారు. ఉత్తమ క్రీడాకారులను ఎంపిక చేసి జాతీయ,అంతర్జాతీయస్థాయిలో ఆడించాలనే ఉద్దేశంలోఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో గెలుపొందిన జట్లుకు నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. జాతీయ వాలీబాల్ రిఫరీ ఎల్.జి.ఎస్.కుమార్, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గవర సూరిబాబు, సర్పంచ్‌లు మచ్చ రామస్వామి, పీతల కృష్ణ, నాయకులు మదినా అప్పలరమణ, పి.ఎస్.ఎన్.పాత్రుడు,"కర్మాగార ప్రతినిధులు సన్యాసిరావు,జి.శంకరరావు, చీఫ్ కోచ్‌లు ఎం.కృష్ణంరాజు,పీడీలు బాల, పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



శృంగవరపుకోట: పుణ్యగిరిలో శివ-పార్వతుల కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు



జామి: భీమసింగిలో పూజలందుకుంటున్న వేంకటేశ్వరస్వామి



శృంగవరపుకోట: పుణ్యగిరిలో భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు

శృంగవరపుకోట: ఉత్తరాంధ్రలో విశిష్ఠ శైవక్షేత్రంగా వాసికెక్కిన పుణ్యగిరి క్షేత్రంలో ఉమాకోటిలింగేశ్వర స్వామి కల్యాణాన్ని రుత్వికులు శనివారం వేదోక్తంగా నిర్వహించారు. అంతకుముందు లక్షబిల్వార్చన, విశేష పూజలు చేశారు. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ పి.రామకృష్ణ దంపతులతో పాటు పట్టణానికి చెందిన పలువురు దంపతులు, భక్తులు పూజల్లో పాల్గొన్నారు. ఆలయం వద్ద మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

ఆలయ వార్షికోత్సవం

ఎస్.కోట పట్టణంలోని దేవీ జంక్షన్‌లో ఉన్న లక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు దంపతులు, ఎంపీపీ సోమేశ్వరరావు, సర్పంచ్ సంతోషికుమారి తదితరులు హాజరయ్యారు.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

జామి: మండలంలోని భీమసింగి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు వరప్రసాద్ ఆచార్యుల ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా స్వామివారిని వివిధ పుష్పాలు, తులసీదళ మాలలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

బొండపల్లి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అభివృద్ధి పనులపై శనివారం సమీక్ష నిర్వహించారు. సమావేశానికి పలు శాఖల అధికారులు గైర్హాజరు కావడంతో వారందరికీ మెమోలు జారీ చేయాలని ఎంపీడీవో ఎస్.హరిహరరావుకు మండల ప్రత్యేకాధికారి ఎస్.వి.కె.దుర్గాప్రసాద్ ఆదేశించారు. ప్రతీ వారం మండల స్థాయి అధికారులతో నిర్వహించే సమీక్ష సమావేశానికి అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. మార్చి 1 నుంచి 3వ తేదీ వరకు జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని తెలిపారు. అలాగే జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయించి, ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలని తెలిపారు.



సమీక్ష సమావేశంలో అధికారులతో చర్చిస్తున్న మండల ప్రత్యేకాధికారి దుర్గాప్రసాద్

• తల్లిదండ్రులకు పాదపూజ



తల్లిదండ్రుకు పాదపూజ చేస్తున్న పిల్లలు

శృంగవరపుకోట: స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో మహావతార్ బాబాజీ వారి ఉచిత క్రియా యోగధ్యాన సేవా సంఘం నేతృత్వంలో ధ్యానం, మాతాపితృపూజలు, సద్గురు సన్మానం కార్యక్రమాలు శనివారం నిర్వహించారు. శ్రీరాం బాలాజీ, శ్రీలక్ష్మి మాతాజీల పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు తల్లిదండ్రులకు తమ పిల్లలతో పాదపూజ చేయించి, ఆశీర్వాదాలు అందజేశారు. తల్లిదండ్రులకు గౌరవించాల్సిన తీరు, మనిషి ఉన్నతికి ఆధ్యాత్మిక మార్గం ఎందుకు అవసరం, ధ్యానం ఎందుకు చేయాలి, ఎలా చేయాలి, అన్న అంశాలను వివరిస్తూ, అందరూ ఆధ్యాత్మిక, జ్ఞాన మార్గాల్లో నడవాలని శ్రీరాం బాలాజీ, శ్రీలక్ష్మి మాతాజీ ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. అనంతరం అమృత భాండం పేరుతో పేదలకు నిత్యవసరాలు అందజేశారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత



మండల స్థాయి విజేత భార్గవికి బహుమతి అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు

శృంగవరపుకోట: ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన ప్రజ్ఞావికాస్ పరీక్షల్లో విజేతలకు మండల కేంద్రంలో ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు శనివారం బహుమతులు అందజేశారు. మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన వి.భార్గవి(నారాయణస్కూల్), ద్వితీయ స్థానంలో నిలిచిన పి.జగదీష్ (రామన్‌స్కూల్), తృతీయస్థానంలో నిలిచిన ఏ.కె.జె.ఆర్.ప్రసాద్(సత్యసాయి స్కూల్)కు ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.రమేష్ బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా రమేష్ మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ఎస్ఎఫ్ఐ కృషి చేస్తోందని, విద్యార్థుల సమస్యలపై నిరంతర పోరాటం సాగిస్తోందని చెప్పారు. ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు ఎం.హర్ష, జయ, కల్యాణి, భారతి, చరణ్ చైతన్య, రోహిత్, రాము తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్లు తప్పనిసరి

శృంగవరపుకోట: కార్మికశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఎస్.కోట, జామి మండలాల పరిధిలో ఉన్న అన్ని రకాల దుకాణాల యజమానులు రిజిస్ట్రేషన్‌లు చేయించుకోవాలని సహాయ కార్మికఅధికారి కె.కరణ్ చంద్ర శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 1988 సెక్షన్-3 ప్రకారం దుకాణాలు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, గతంలో రిజిస్ట్రేషన్లు చేయించి న వారు వాటిని రెన్యువల్ చేయించుకోవాలని పేర్కొన్నారు. దుకాణదారులు ఈనెల 29వ తేదీలోగా వార్డు లేదా గ్రామసచివాలయాల్లో తగిన రుసుం చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించి సర్టిఫికెట్‌ను దుకాణంలో ప్రదర్శించాలని, లేకుంటే వారిపై క్రిమినల్ చర్యలకు సిఫార్సు చేసి, దుకాణం సీజ్ చేయాల్సి ఉంటుందని తెలిపారు.

ఆకట్టుకున్న ప్రాజెక్టుల ప్రదర్శన



ప్రాజెక్టులను తిలకిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి విజయచంద్ర

కొత్తవలస: సైన్స్ ఎక్స్ పో..లో భాగంగా మండల కేంద్రంలోని రవీంద్రభారతి పాఠశాలలో విద్యార్థులు చేపట్టిన సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శన ఆకట్టుకుంది. కొత్తవలస జూనియర్ సివిల్ జడ్జి ఎస్.విజయచంద్ర ప్రాజెక్టులను శనివారం సందర్శించగా, విద్యార్థులు తమ ప్రాజెక్టుల పనితీరును జడ్జికి వివరించారు. సైన్స్ ప్రయోగాల ద్వారా విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయొచ్చని, తద్వారా వారిలోని ప్రతిభను అంచనా వేయొచ్చని సందర్శకులు అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.చంద్రశేఖర్, పశువర్ధక శాఖ ఏడీ బి.గంగాధర్, డిప్యూటీ తహసీల్దార్ టి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులకు గడువు పెంపు

వేపాడ: ఏపీ సాంఘిక సంక్షేమం గురుకుల బాలికల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తు చేసుకును గడువును ఈనెల 28వరకు పెంచినట్లు స్థానిక గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఫ్లారెన్స్ శనివారం ఓప్రకటనలో తెలిపారు.5వ తరగతిలో 80 సీట్లు ఉన్నాయని, వీటిలో 60 ఎస్సీలకు, 10 బీసీలకు, 5 ఎస్టీలకు, 4 బీసీలకు, ఒకటి ఓసీకి కేటాయించినట్లు పేర్కొన్నారు. ఇంటర్ ఎంపీసీ, బైపీసీలో చెరో 40 సీట్లు కేటాయించారని తెలిపారు. అర్హులు దరఖాస్తు చేసుకోవాలని, మార్చి 10న ఉదయం 10 గంటల నుంచి 12 వరకు 5వ తరగతి ప్రవేశ పరీక్ష , మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటల వరకు ఇంటర్ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని సూచించారు.

14 బోర్లు మంజూరు



బోరు డ్రిల్లింగ్ పనులను పరిశీలిస్తున్న డీఈఈ పైడిరాజు, నాయకులు

వేపాడ: మండలంలోని జాకేరు గ్రామంలో జిల్లా పరిషత్ నిధులతో హ్యాండ్ బోరు ఏర్పాటుకు శనివారం డ్రిల్లింగ్ పనులు చేయించారు. ఈ పనులను ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ కె.ఆర్.వి.పైడిరాజు శనివారం పరిశీలించారు. జిల్లా పరిషత్ నుంచి మండలానికి 14 బోర్లు మంజూరయ్యాయని ఆయన చెప్పారు. వీటిలోఒక బోరుబావిని జాకేరు గ్రామానికి జెడ్పీటీసీ ఎస్.అప్పలనాయుడు సిఫార్సుతో మంజూరు చేశామని తెలిపారు.పంచాయతీ కార్యదర్శి ప్రభుదాసు,నాయకులు బుద్దా చిన్నమ్మలు, కలవలపల్లి సూరిబాబు, వసుదేవరావు, బుద్దాజగ్గారావు, తదితరులు పాల్గొన్నారు.

పల్స్ పోలియోను విజయవంతం చేద్దాం

కొత్తవలస: మార్చి 3వ తేదీన నిర్వహించనున్న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్యశాఖ సిబ్బంది అంతా కలిసి విజయవంతం చేద్దామని వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి గోపాలకృష్ణ అన్నారు.పీహెచ్‌సీ ఆవరణలో ఆరోగ్యశాఖ సిబ్బందితో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పీహెచ్‌సీ పరిధిలో 5 ఏళ్ల లోపు పిల్లలు 1,710 మంది ఉన్నారని, వీరికి పోలియో చుక్కలు వేసేందుకు 19 బూత్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైల్వేస్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్‌లలో ప్రత్యేక బూత్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. 3వ తేదీన పోలియో చుక్కలు వేయని పిల్లలకు, 4,5వ తేదీల్లో ఇళ్లకు వెళ్లి పోలియో చుక్కలు వేయాలని సూచించారు.పీహెచ్ఎన్ జగదాంబ, హెచ్‌వీ వి.పద్మావతి, హెల్త్ సహాయకులు సత్యారావు తదితరులు పాల్గొన్నారు.



వైద్య, ఆరోగ్య సిబ్బందికి సూచనలు చేస్తున్న డాక్టర్ గోపాలకృష్ణ

జాబ్ కార్డు ఉన్నవారందరికీ పని కల్పించాలి



ప్రజావేదికలో మాట్లాడుతున్న ఎంపీపీ హైమావతి

గంట్యాడ: ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని, పారదర్శకంగా పనులను చేయించాలని ఎంపీపీ పీరుబండి హైమావతి ఉపాధి సిబ్బందికి సూచించారు. మండలంలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి పనులపై ఇటీవల డీఆర్పీలు సోషల్ ఆడిట్ చేశారు. ఆడిట్ నివేదికలపై మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం ప్రజావేదిక నిర్వహించారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.12 కోట్ల పనులు చేపట్టినట్లు డీఆర్పీలు నివేదికలు చదివి వినిపించారు. ఎంపీపీ మాట్లాడుతూ అడిగిన ప్రతి ఒక్కరికి పని కల్పించాలని, పనులను గుర్తించడంలో ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని సూచించారు.డ్వామా పీడీ జి.ఉమాపరమేశ్వరి మాట్లాడుతూ గంట్యాడ మండలంలో చెరువు, కాలువ పనులు మాత్రమే చేస్తున్నారని ,అలా కాకుండా ప్రభుత్వం సూచించిన విధంగా 270 రకాల పనులు చేపట్టాలని సూచించారు. వేతనదారుల మస్టర్ల వేయడంలో పొరపాటు లేకుండా చూడాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై చర్యలు తప్పవన్నారు. ఒక్క కుటుంబానికి కూడా పని కల్పించ లేకపోయిన చిమానపురం,జగ్గాపురం, రావివలస, తాటిపూడి,లక్కిదాం, పెంటశ్రీరాంపురం, కొండతామరపల్లి, రేగుబిల్లి, వసాది, బురదపాడు గ్రామాల ఉపాధి సిబ్బందికి జీతాలు నిలుపుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, ఎస్.కోట ఏపీడీ శారదాదేవి, గజపతినగరం ఏపీడీ జనార్ధన్, విజిలెన్స్ అధికారి వెంకటరమణ, అంబుడ్సమెన్ శనపతి అన్నపూర్ణ, ఎంపీడీఓ వై. భవాని తదితరులు పాల్గొన్నారు.